



గోరా శాస్త్రి

మధ్యాహ్నం ఒంటిగంట దాటుతుంది. సీతకాలపు చురుకైన ఎండ. వాలుకుర్చీలో మైకంగా మేనువాల్చి, ఏకాగ్రతతో చుట్ట కాలుస్తూ, కిటికీలోంచి చూస్తున్నాను. ఎదురుగా శీతాలపు చెట్లూ, పరిగిపొదలూ; ఇంకొంచెం దూరంలో తుమ్మతోట. బంగాళా వాచరు వెంకన్న వరండాలో గుర్రుతీస్తూ నిద్రపోతున్నాడు.

నాకు ఎదురుగా ఇంకో కుర్చీలో చయనులు సిగరెట్టు కాలుస్తూ పడుకున్నాడు. మేలుకునే కలలు కంటున్నాడు. ఆ మధ్యాహ్నం మాకు వెంకన్న వండిపెట్టిన భోజనమే గతిఅయింది. వెంకన్న వంటలో ఉపయోగించిన పద్ధతుల్లో ఏం తిరగుడువుందో కాని, అన్నంతిన్న దగ్గిరనుంచీ నల్లమందు సేవించిన చైనావాడి మైకంలాంటిది మమ్మల్ని ఆవరించింది. కుర్చీల్లో కాపురం చేస్తూన్న అన్నిలక్షల నల్లులూ మా మైకాన్ని వదలగొట్టేందుకు ప్రయత్నించాయి. కాని లాభం లేకపోయింది. చయనులు కళ్ళుమూసుకునే రెండు నల్లుల్ని హతమార్చాడు. నా చేతిలో కూడా ఒక నల్లి వీరస్వర్గం అలంకరించింది.

మేం మకాంచేసింది భద్రాచలానికి సుదూరంలోవున్న రహదారి బంగళా. మేం వెళ్ళవలసిన ఊరు అక్కడికి ఇంకా అయిదు మైళ్ళుంది. క్రొత్తయిన సినిమా కంపెనీ ఒకటి మద్రాస్‌లో స్థాపించాం. ప్రకటనలు ఇమ్మని అప్పుడే స్నేహితులైన పత్రికాధిపతులు (తెలుగు పత్రికలు సుమండీ!) చనువుగా వేపుకుతింటున్నారు. షేర్లు అమ్మడానికని సంచారం ప్రారంభించాం. భద్రాచలానికి దగ్గిరగా అవంతిపురంలోవున్న రావుసాహెబ్ బట్టీనాయుడుగారు ఇటీవల మద్రాస్ వచ్చినప్పుడు మేం తియ్యబోయే చిత్రంలో నటించబోయే తారల ఫోటోలుచూసి బ్రహ్మానందభరితులయారు. తాము పదివేలరూపాయిల షేర్లు కొంటామనీ, తమని చిత్రానికి డైరెక్టరుగా చెయ్యవలసిందనీ, అన్నారు. ప్రస్తుతం మా ప్రయాణం బట్టీనాయుడుగారి గ్రామానికే. రహదారి బంగళా మజిలీ.

చయనులు అన్నాడు: "ఎన్ని సిగరెట్లు తగలేసినా, యీ మైకం మనని వదిలేటట్టులేదు. వెంకన్నని పిలిచి కాస్త టీ తయారుచెయ్యమని చెపితే?"

దివ్యమైన ఆలోచన. పిలుద్దామని అనుకుంటూండగానే వెంకన్న గదిలోకి ప్రవేశించాడు.

"చూడు వెంకన్నా, మాటలోనే నువ్వే వచ్చావు. కాస్త టీ తయారుచేసి తీసుకువస్తావా" అన్నాను.

సిత్తం, సిత్తం, తమరికి టీ టైము అయిందని పోల్చానండి. అందుకనే కోటలోకి కబురు పెట్టాను. క్షణంలో తమరికి బ్రాండీనాటి టీ ఒస్తాదండి" అన్నాడు.

నాకు అరంకాలేదు. "కోటేమిటి? అంటే ఏమయినా కాఫీ హోటలా? ఈ చుట్టుపక్కల ఏమీ హోటల్ లేదే?" అని అడక్క తప్పింది కాదు.

కోరమీసాల్లోంచి వెంకన్న చిన్నగా నవ్వాడు. "సిత్తం, అదంతా తమకి ఎందుకులెండి! బాబయ్యగారికి కావలసింది టీ. అదే తయారై ఒస్తాది. ఎదవ టీ, నేనే యిక్కడ తయారుచేద్దునుగాని, నాదగ్గిర మేకపాలుగాని మరిలేవాయె!" అన్నాడు.

కొంచెం మైకం తగ్గించుకున్నాడు చయనులు. "మేకపాలు సరేలే, కోటలో టీ అంటావ్ — దానిసంగతి చెప్పు. ఆ దిక్కుమాలిన టీ ఏదో తాగవలసినవాళ్ళం మేంకదూ! ఎవరు తయారు చేస్తున్నారు?" అన్నాడు.

"అలా సెలవిమ్వకండి బాబయ్యా, తమరు కాస్త ఒంగి కిటికీలోంచి చూడండి. ఆ కనబడే జిన్నిపొదలుదాటి, పాపిడీతుప్పలుదాటి ఇంకా పైకిచూడండి. అక్కడ ఓ కోటలాంటిది కన బడిందా? అదేనండి. అక్కడినుండే తమకి టీ వస్తుంది" అన్నాడు, రిటైర్డు హవల్దార్ వెంకన్న.

"ఎదో కోట మనకెందుకుపోదూ, కావలిసింది టీ కద." అన్నాను.

చయనులు మరో సిగరెట్టు వెలిగించి "ఆకలి మంటచే మలమలమాడే అనాథులందరు లేవం డోయ్" అనేపాట మొదలుపెట్టాడు. ఆ గాన ప్రవాహంలో వెంకన్న బయటకి కొట్టుకు పోయాడు.

పాట ఆగింది. అటువంటి ఆకలిపాట చయనులు మరీ ఆకలిగా పాడాడేమో, తదనంతరం నిశ్శబ్దం చాలా హాయిగావుంది. పిట్టలఅరుపులూ, ఎండుటాకుల గలగలా, ఇవికూడా ఆ నిశ్శబ్దంలో భాగంగా నేవున్నట్టు తోచింది. నిశ్శబ్ద శబ్దాల్ని వినగలిగే అదృష్టం అటువంటి పరిసరాల్లోనే లభిస్తుంది.

అకస్మాత్తుగా ఎండుటాకులమీద అడుగుల చప్పుడు వినబడింది. ఒకవేళ టీగాని వస్తోం దేమోనని కిటికీలోంచి చూశాను. వస్తున్నది టీ మాత్రం కాదు.

మరేమిటి? దీర్ఘకాయుడైన ఒకవ్యక్తి. ముందు ఒక పూరెడు పొడుగు తలపాగామాత్రమే కన బడింది. క్రమంగా తలపాగాకింద తెల్లని కోర మీసాలూ, మీసాలకింద ఆకుపచ్చని చెమ్కీ షెర్వానీ, తెల్లని సుర్వా, చెడావులూ, ఇవన్నీ కనబడ్డాయి. చేతిలో ఒక తుపాకి. మెడలో తెల్లవి పూసలు.

క్షణమాత్రం తన్మయావస్థలోపడ్డాను. ప్రస్తుతం రాజపుత్రలోకం అయినట్టూ, నేను మకాంచేసింది ఆరావళి పర్వతప్రాంతం అయినట్టూ, నమ్మిక తప్పిందిగాదు.

"చయనులూ!" అన్నాను.

"ఏం నాయనా!" అన్నాడు, మహోజాలిగా.

"అలా చూడూ, ఆ నడిచివస్తున్న వ్యక్తిని! పురాణపురుషుడైన దుష్యంతుడా? అయితే చేతిలో తుపాకిఉందే? లేక ఎవరైనా రసపుత్ర వీరుడా? ఇవి రెండూ కాక, మనం తియ్యబోయే తెలుగు ఫిల్ములో కథానాయకి నాన్నా?...... ఎవరు అతను?"

గుమ్మం దగ్గిరికివెళ్ళి చూశాడు, చయనులు ఇంతలోకే ఆ వ్యక్తి బంగళా సమీపించి వరండా మెట్లు ఎక్కుతున్నాడు. చయనులు నన్నుచూసి అర్థయుక్తంగా కన్నుగీటి, ఒక్క చిరునవ్వు నవ్వాడు.

వచ్చినవ్యక్తి తిన్నగా గదిలోకి ప్రవేశించి, గదంతా లిప్తలో సింహావలోకనం చేశాడు. ఎండలో నడిచివచ్చాడేమో, ముచ్చెమటలూ పోస్తున్నాడు.

చయనులు ఎదురుగావెళ్ళి నమ్రతతో వంగి నమస్కరించాడు. "జయం,జయం, మహారాజులుం గారికి! తిరిగి చిరకాలానికి తమ దర్శనం చేసుకునే అదృష్టంకలిగింది.తమరికి నేను జ్ఞాపకంవున్నానా" అని ఒక్కబిగిని అనేశాడు. మహారాజు చేతిలో తుపాకీ తీసుకుని స్వయంగా గోడకి చేరవేశాడు.

చెమ్కీబరువుల మోచేతితో మహారాజా వారు మొహంలోని చెమటతుడుచుకుంటూ, ఇలా అన్నారు "ఓహో! చయనులుగారూ, జ్ఞాపకం లేకేం, మారు మీరు ఎప్పుడూ జ్ఞాపకంవుంటారు. మా సంస్థానానికి మీ మేనమామలు చేసిన సేవ అపారమైంది. మేం మరచిపోగలమా?...ఓహో! నేడు మాకు ఆనందకరమైన రోజు, మిమ్మల్ని చూడ్డంవల్ల." అని నన్నుఉద్దేశించి "వారెవరూ?" అన్నారు మహారాజా.

నాకు అంతా అగమ్యగోచరంగావుంది. చయనులు కనుసైగచేశాడు. మహారాజుగారికి నేనూ వంగి నమస్కరించాను.

మహారాజావారిని చూపిస్తూ, మేఘగంభీర స్వరంతో చయనులు ఇలా అన్నాడు: "వీరు శ్రీశ్రీశ్రీ దసగిర్ నవాబ్ హుజూర్ తబ్జి మహా

రాజా రతిస్కంధరాయలుంగారు, మహారాజా ఆఫ్ ఫిరంగి జానకిపురం." నన్ను మహారాజా గారికి చూపిస్తూ "వీరు శ్రీయుత సుధారస శర్మ గారండి. మా ఫిల్ముకంపెనీ మ్యూజికల్ డైరెక్టరు. మేం ఇద్దరం కలిసేవచ్చాం." అని పరస్పర పరిచయం చేశాడు.

అందరం కుర్చీల్లో కూర్చున్నాం. ఈ ఆడావిడి అంతావిని కాబోలు, వెంకన్న తొందరగా వచ్చి, మహారాజాముందు సాష్టాంగదండప్రమాణం చేసి, "అపరాధం ప్రభూ, అపరాధం" అని లెంపలు వాయించుకున్నాడు. వెంకన్నను చూసి, మహారాజావారు అనురాగంతో నవ్వారు.

వెంకన్న కూతురు, పద్దెనిమిదేళ్ళ పడుచు, మూడుకప్పుల్లో టీ తీసుకువచ్చింది.

తేనీటిసేవ అయింది. నేనూ మహారాజావారూ చుట్టలు వెలిగించాం. చయనులు మరో సిగరెట్టు వెలిగించాడు.

"అయితే చయనులుగారూ, మీరు యీవూరు ఏపనిమీద వచ్చారూ?" అని మహారాజావారి ప్రశ్న.

"చిత్తం. మేం మద్రాస్‌లో ఒక సినిమా కంపెనీ పెట్టామండి. షేర్లు అమ్మడానికిగాను దేశసంచారం చేస్తున్నాం. ఇక్కడ బట్టీనాయుడుగారు కొన్నిషేర్లు కొంటామన్నారూ, అందుకని వచ్చాం", అన్నాడు చయనులు.

పండుమీసాల్లోంచి మహారాజావారు వెన్నెల వంటి నవ్వునవ్వారు. నిదానంగా పరికించిచూశాను. పొడుగాటి సూటైనముక్కు. విశాలమైన ఫాలం. చురుగ్గా మెరిసే నీలంకళ్లు. వయస్సు డెబ్భైదాటి వుంటుంది. అంత మహారాజూ నాకెందుకో పసిబిడ్డవలె గోచరించాడు. ఆ చెమ్కీకోటూ, తలపాగా, అవన్నీచూస్తే నిజంగా జాలివేసింది. అవి ఎన్నోతరాల రాపిడి అనుభవించి జీర్ణించి జాలిగా మూలుగుతున్నాయి. అతడు తొడుక్కున జోడు అతడికంటె వృద్ధాప్యంలోవున్నట్టు గోచరించింది. ఎవరీ మహారాజు? ఇటువంటి దీనావస్థలో వున్నారేం?

అతడూ, చయనులూ చాలా ఆప్యాయంగా మాట్లాడుకుంటున్నారు. నా ఆలోచనలు అన్యథా వున్నాయి. ఒక నిర్వికల్పసమాధిలో వున్నట్టుగా వుంది, నా మనస్సు. మహారాణా ప్రతాప్‌సింగూ, రాజస్థాన కథావళీ, 'రసపుత్ర రమణి' ఫిల్ములో నళినీ టర్క్యూడూ, మొఘల్ దివాణాల భోగలాలసతా, గాడిదపాలలో మహారాణులస్నానాలూ ...ఇవన్నీ ఊహించుకుంటూ, కూర్చున్నాను.

అంతవరకూ నేను నిజం నిజం మహారాజుని గాని, జమీందారుని గాని, ఎప్పుడూ చూడలేదు- బొమ్మల్లోతప్ప. జమీందార్లు ఏంతింటారో అనీ, ఎలా తింటారోఅనీ, వాళ్లు ఎలా మాట్లాడతారో అనీ, ఇవన్నీ ఊహించుకోవడం నాకు ఎంతో సరదా. అందుచేత ప్రస్తుతం నేను ఒక నిజం నిజం మహారాజుకి ఎదురుగా కుర్చీలో కూర్చున్నానంటే, నాకెంతో ఆనందం కలిగింది. గతించిన నా పూర్వులలో పాపిష్టులకందరికీ ఇంక స్వర్గ కవాటాలు వాటంతట అవే తెరుచుకుంటాయని నమ్మగలిగాను.

చయనులు మహారాజాగారిని ప్రశ్నిస్తున్నాడు: "తమ జమీ వ్యవహారాలు ఎలాగున్నాయి ప్రభూ!"

నేనయితే అలా అడగలేను. మహారాజావారిని ఎలా సంబోధించాలోకూడా నాకు తెలీదు.

మహారాజావారు సెలవిస్తున్నారు: "ఇలా ఏటమార్గంగా నడిచి విశ్రాంతికని బంగళాకి వచ్చాను. మీరు అప్రయత్నంగా కనబడ్డారు... జమీ వ్యవహారాలు ప్రస్తుతం మాకు అంతఆనందం కలిగించేవిగాలేవు. మా మొఖాసాదార్ల ప్రభుభక్తి క్రమంగా తగ్గుతూన్నట్టు మేం భావిస్తున్నాం. రెండో అమ్మాయిగారి వివాహసమస్యా, పెద్దమ్మాయిగారి కుమారుడి ఉపనయన సమస్యా, కొంచెం మామనస్సుని ఆందోళనపెడుతున్నాయి. చయనులుగారూ! చూశారూ, మీ మేనమామల వంటి ప్రభుభక్తిపరాయణులు ప్రస్తుతం ఎక్కడా లేకపోవడంవల్ల, మా ఆనందం కొంచెం తగ్గిందనే మేం నిర్ణయించవలసివస్తోంది." మహారాజావారి కంఠం 'మా నిషాద' గీతం పలికినప్పటి వాల్మీకి కంఠంవలె వుంది.

లేచారు, మహారాజావారు. "మళ్ళొకసారి దర్శనం ఇస్తాం, చయనులుగారూ!" అన్నారు.

"ఒక్క క్షణం" అని చయనులు నాకు కనుసైగ చేసి వరండాలోకి వెళ్ళాడు. నేనూ అనుసరించాను. నెమ్మదిగా నా చెవిలో అన్నాడు.

"పర్సు నీ దగ్గిర ఉంది కదూ, ఒక యాభై రూపాయిలు ఇయ్యి." తీసుకున్నాడు. గబగబా మహారాజావారిని సమీపించి, ఒక్కసారి కోటు జేబులోకి చెయ్యిపోనిచ్చి తీసేశాడు. "మీరు జానకీనాథులు మహారాజా! మేం ఉపేతలు సన్నించాలి" అన్నాడు.

మహారాజావారి కళ్ళల్లో శ్రావణ మేఘాలు పరిగెట్టాయి. "చయనలుగారూ! మా సంస్థాన ఆశీర్వచనం మీకు సర్వదా ఉంటుంది" అన్నారు.

.. ... ...

చంద్రోదయం అయింది. వావిలిపొదల మధ్య కాలిబాటమీద నడుస్తున్నాం. గాలిలో భీమరాజుపిట్ట కూతలు తేలివస్తున్నాయి. బట్టీ నాయుడుగారి గ్రామం మా గమ్యస్థానం.

"చయనులు నాన్నా!" అన్నాను.

"ఏం?" అన్నాడు, మరో సిగరెట్టు వెలిగించి.

"జరిగిన నాటకాన్ని కొంచెం వ్యాఖ్యానిస్తావా?"

"మహారాజే ఒక వ్యాఖ్యానం. వేరే చెప్పవలసింది ఏముంది? కనబడ్డం లేదూ?"

"అయితే మహారాజు అని ఎందుకూ పిలవడం?"

"ఏం చేస్తాం? అతని తండ్రుల కాలంలోనే జమీందారీ దివాలా తీసింది. సీమదుక్కల కింద, సానిపాపలకింద, జమీ కరిగిపోగా, నేటికి చెమీ కోటుతో మహారాజు మిగిలాడు. ఏం చేస్తాడు? సన మొఖాసాదార్లకి ఇప్పటికీ తాఖీదులు పంపిస్తాడు, నజరానాలు త్వరగా పంపమని—అంటే, ధాన్యం వగైరాలు. వాళ్ళే అభిమానంగా పోషిస్తున్నారు...చుట్టుపక్కల ప్రజానీకంవారి పూర్వీకులూ-అంతా యీ జమీని ఆధారం చేసుకుని బాగుపడ్డవాళ్ళే. వాళ్ళ రక్తం ఇంకా తిరుగుబాటు చెయ్యలేదు. అంతా యీ మట్టి తాలూకు పిల్లలే కదోయ్! అందుకనే మహారాజంటే జాలి. ప్రజలు సాయం చెయ్యకపోతే ఏం చేస్తాడు? కాని ప్రజలు సాయం చేస్తారు. అతణ్ణి చూసి ద్వేషించడానికి ఏమీ కారణాలు లేవు."

"మరి ఇంకా మహారాజని పిలిపించుకోవడం, యీ లాంఛనాలూ, ఇవన్నీ?"

"అవి మాత్రం ఎవరికి హాని చేశాయి? నువ్వు మర్యాద చేస్తేనే నీ దగ్గరకి వస్తాడు. లేకపోతే రాడు. జాలిపడవేం, తలుచుకుని?"

నేను నవ్వు ఆపుకోలేకపోయాను. "పోనీ మామూలు మనిషిగా ఉండరాదూ? యీ ఆత్మవంచన అంతా ఎందుకూ?"

చయనులు నవ్వుతూ మరో సిగరెట్టు వెలిగించాడు.

"వెర్రినాయనా, అక్కడే ఉంది. మనిషి జీవితంలో తిరకడంతా! నీకూ నీ కమ్యూనిష్టు స్నేహితులకీ అర్థం కాదు కాని, రాజ్యం లేకపోయినా అతడు మహారాజే! యీ గడ్డమీద పుట్టిన ప్రజాసామాన్యానికి అందరికీ అర్థం అయింది. వాళ్ళ యిష్టం మీదనే అతనింకా మహారాజు."

"చయనులు నాన్నా, ఇంకొక్క ప్రశ్న" అన్నాను. "మహారాజుకి ఆ టుపాకీ ఎందుకూ?"

"వెర్రి నాగమ్మా, అది పేలే టుపాకీ కాదు. మొదటిసారిగా ఒక మహారాజుని చూశావు. నీకు అన్నీ ప్రశ్నలే." అన్నాడు.

నేను మరి మాటాడలేదు.

---

## సలహా

నవలలు చదవడంలో కొత్త పద్ధతి: మధ్యను తీసి ప్రారంభించడం,

ఇందువల్ల రెండు లాభాలు: ఒకటి, నవల ఎలా ముగుస్తుందో తెలియదు. రెండోది, ఎలా ప్రారంభం అయిందో కూడా తెలియదు.

---

## అసహాయ శూరుడు

మాజిస్ట్రేటు— ఈ దొంగతనం నువ్వొక్కడవే చేశావా?

దొంగ—చిత్తం, మహాప్రభూ! ఈ రోజుల్లో ఇంకొకణ్ణి నమ్మడానికి వీల్లేదు.

---

* ఆనందవాణి